# సునకముఖి



మాలతీ చందూర్

అఖిల భారత స్థాయిలో కుమారి సువర్ణముఖిని ఉత్తమ జాతీయ నటిగా నేషనల్ ఎవార్డ్స్ కమిటీ ఎన్నుకున్నదన్న వార్త, విని, అశేష ఆంధ్రప్రజానీకంతోపాటు రామనాధం కూడా ఆనందించాడు. ఈ వార్త సాయింత్రం ఇంగ్లీషు న్యూస్‌లో, తెలుగు వార్తల్లోనూ ప్రముఖంగా- రేడియో వారు ప్రసారం చేసినపుడు- విన్న, అసంఖ్యాక శ్రోతలలో రామనాధం కూడా ఒకడు. రామనాధానికి కాస్త గర్వంగా కూడావుంది. అతను ముప్పై ఏళ్ళకి పైగా మద్రాసులో స్థిరబడినా. జన్మతః సరి ఆంధ్రుడవటం చేత- తెలుగువారు- ఎక్కడ ముందు శ్రేణిలోవున్న- ఆనంద పడిపోతూ వుంటాడు.

సువర్ణముఖి హిందీ సినిమాలో నటించి ఉత్తమనటిగా బహుమతి పొందటం రెండు విధాలుగా ఘనమైన విషయం అంతకిక్రితం తెలుగు ఆడబడుచులకి- ఊర్వశి ఎవార్డురాలేదని కాదు; అంతక్రితం తెలుగుతారకి ఎవార్డు వచ్చినపుడు. ఆ నటి తన స్వంత కంఠంతో హిందీ పిక్చర్‌లో మాట్లాడలేదనీ, మరో వాయిస్‌తో సంభాషణలు చెప్పించారనీ, ఒక పాత్రోచితనటన వుత్తమమైనది. అని నిర్ణయం జరగనపుడు అందులో డైలాగ్ డెలివరీకూడా మిళితమై వుంటుందనీ, అంచేత ఈ ఎవార్డు నిర్ణయం న్యాయం లేదని- చిన్న చిన్న విమర్శనలు- విసుర్లూ వచ్చాయి. ఈసారి అటువంటి లోపాలు ఎంచే అవకాశం ఎవరికీ లేకుండా సువర్ణముఖి- తన డైలాగ్‌లు తానే,- హిందీ చిత్రంతో చెప్పింది. అసలు, ఆమె హిందీనటిగాదు- దక్షిణాది నుంచివచ్చిన తెలుగునటి అంటే కూడా హిందీవాళ్ళు వొప్పుకోటం లేదు. అంతబాగా హిందీలో డైలాగ్స్ చెప్పి- ప్రేక్షకులని, జ్యూరీ సభ్యులనికూడా మెప్పించింది సువర్ణముఖి.

ఎందులో ముందువున్నా లేకపోయినా, రాజకీయాల్లో- సినిమాల్లో మన తెలుగువాళ్ళు ప్రధమ స్థానంలో వుంటారు— అనుకున్నాడు రామనాధం రేడియో వార్తలు వింటూ.

మరో గంటసేపట్లో హైద్రాబాద్‌నుంచి ఫోను. "మొగుడా- యింట్లో వున్నావా?" అంటూ, రామనాధం 'చిత్రగమనం' వీక్లీది- మద్రాసులో రిపోర్టర్- కమ్- రిప్రజెంటేటివ్— వగైరా వగైరా,, మద్రాసులోని సినిమా వార్తలు,- ముఖ్యంగా తారల్ని యింటర్‌వ్యూలు చెయ్యడంలో రామనాధం దిట్ట, నెలకి ఒకసారన్న అతని యింటర్‌వ్యూ లేకపోతే పాఠకులు వూరుకోరు.

"మొగుడా" అని, ఎడిటర్‌గారు రామనాధాన్ని ముద్దుముద్దుగా పిలుస్తూంటారు— సీనియర్ సముద్రాలవారి బాణిలో! అలా "మొగుడా" అని సంబంధించినపుడు, తమ ఎడిటర్‌గారు చాలా సంతోషంగా, ఆప్యాయంగా వున్నారని అర్ధం.

"ఏమయ్యా యింట్లో వున్నావేం?" హైద్రాబాద్ నుంచి అడుగుతున్నాడు. ట్రంక్‌కాల్ అయినా? మంచితాపీగా మాట్లాడుతాడు

గురుడు, తన డబ్బుకాదుగా- అనుకున్నాడు రామనాధం.

"ఈ రోజు- సినిమాలూ- పార్టీలూ లేవండి." అన్నాడు వినమ్రతగా.

"మన సువర్ణముఖికి- ఆలిండియా ఎవార్డు వచ్చింది విన్నారా?"

"విన్నానండి. కంగ్రాట్యులేషన్స్ చెపుదా మనుకుంటుంటే- మీరు ఫోన్ చేశారు." ఫోన్‌లో అలా అనాలేగాని- అటువంటి వుద్దేశ్యం అతనికి కలగ లేదు.

"ఫోన్‌లో ఎందుకుగాని, రేపు ఏడున్నర ఎనిమిదీ మధ్యన సువర్ణముఖిని కలుసుకోటానికి టైము ఫిక్స్ చేయించాను...."... వింటున్నాడు-వూ-ఆ అనకుండా రామనాధం. "అల్లా బెల్లం కొట్టి నట్లు వూరుకుంటా వేమిటయ్యా, మొగుడు. అసలాయన్తో చెప్పి- ఎపాయింట్‌మెంట్ ఫిక్స్ చేయించాను. మన పేపరుకే ఫస్ట్ ఇంటర్వ్యూ యివ్వబోతున్నది. ఇంకెవ్వరికీ యివ్వకూడదని కట్టుదిట్టం చేశాను. నువ్వు వెళ్ళి- ఆవిడగార్ని యింటర్వ్యూ చెయ్యాలి." అన్నాడు ఎడిటర్‌గారు అవతలినుంచి.

"అల్లాగేనండి."

"నువ్వల్లా నీరసంగా వుంటే, వూర్కోను. ఈ వారం కవర్‌పేజీ మీద సువర్ణముఖి వేస్తున్నాము. కవరుపేజి ప్రింటయి పోతోంది. మొదటి రెండు పేజీల్లో- ఉత్తమ నటిగా ఎన్నికయిన- సువర్ణముఖితో భేటీ- మన "చిత్రగమనం"-లో మొట్ట మొదట అచ్చవాలి- తెలిసిందా? మంచి పసందయిన ప్రశ్నలు వెయ్యి, ఇవన్నీ నేను చెప్పక్కర్లేదనుకో. వెడుతూ- వుత్త చేతుల్తో వెళ్ళకు...."

"ఏం పట్టుకెళ్ళనండి- చీరెలా వద్దురా- నాకు సెలక్షన్ తెలియదు,.... ఇప్పుడు ఎనిమిది దాటిందండి- షాపులూ అవీ వుండ...."

"అంత ఖరీదైనవి అక్కర్లేదయ్యా... బాబూ యాపిల్స్, అరటిపళ్ళూ, కాడ్‌బర్రీ చాక్‌లెట్ బార్స్ పట్టుకెళ్ళు. అవేవో ఫైవ్‌స్టార్ అంటారుట- అవి"


"అల్లాగేనండి-"


"బాగా మస్తుగా పట్టుకెళ్ళు. ఆఫీసు ఖాతాలో రాసెయ్ రేపు మధ్యాహ్నానికల్లా మేటరు చేతిలో వుండాలి-"

"సరేనండి."

"మళ్ళీ చెపుతున్నా. ఈ యింటర్వ్యూ మొట్టమొదట ప్రచురించిన ఘనత మనకి దక్కాలి. టైలీస్ ఎక్కడా యివ్వకుండా ముందు మనకోసం ప్రత్యేకంగా యిస్తున్నది. పది దాటితే ఆ విడగారు ఇంట్లో వుండదు. పొద్దుటే ఎనిమిది లోపల అక్కడుండాలి. సరేనా?"








"సరేనండి."

"నంబర్‌వన్- ఇంటర్‌వ్యూ పట్టుకు రావయ్యా. బాస్ తో చెప్పి...."

ఇలా ప్రతిసారీ ఆశపెట్టటం- తనకు ఎడిటర్‌కి యిద్దరికి కొత్తగాదు. ఇంటర్‌వ్యూ అంటే చచ్చినట్టు పొద్దుటే లేవాలి. ఉదయించే సూర్యుణ్ణి- చూడటం- అంతవెధవ పని- అదేగాని మరొకటి వుండదు.

"ఏమయ్యా లైన్లో వున్నావా?"

"వింటున్నానండి."

"మంచి పోజుల్లో నాలుగైదు ఫోటోలు గూడా తీసిపట్రా. నీ కలర్ కెమెరాకి- పని చెప్పు. ఇదిగో బ్రహ్మాండం బద్దలయేట్లు వుండాలయ్యా మన యింటర్‌వ్యూ. చూడు, సువర్ణముఖికి- నా ఆశీర్వచనాలు- మన పాఠకుల శుభాకాంక్షలు చెప్పు."

"అల్లాగే చెపుతానండి."

"అసలు నన్నే ఫ్లయిట్‌లో వెళ్ళమన్నారా బాస్- నీ లాగా ఖబుర్లు రాబట్టం నాకు రాదయ్యా- అందుకని..."

పోదీ, ఈ ముసలాడికి- ఎంత మంది తారల్తో ఫొటోలు దిగినా- తృప్తి వుండదు. రేపో- మాపో రిటైర్ పూర్తి చేసుకుంటానంటున్నాడు. ఇంకా యీ ఆడతారలమీద గ్లేమరు పోలేదా.... మనసులో కోరికల్లా ఆలోచనలు ముసురుకుంటున్నాయి. అవతల ఫోన్‌లో గొడవ ఆగిపోయింది. క్లిక్ మన్న శబ్దం. "అమ్మయ్య"- అనుకొని టైము చూసుకున్నాడు. ఎనిమిదిన్నర దాటింది. ఈ వేళప్పుడు- పత్యా లాక్‌లెట్లూ ఎవరు తెస్తారు? వెళ్ళటానికి బద్ధకం వేసింది. గాడిదగుడ్డు. ఏం పట్టుకెళ్ళక్కర్లేదు- అని సరిపెట్టుకున్నాడు రామనాథం.

రామనాథానికీ, బాలసూర్యుడికీ చుక్కెదురు. అతనికి ఉషారాణితో పరిచయం లేదు. సంధ్యారాణితో తప్ప, ఏ రాత్రి పన్నెండింటికో నిద్రలోకి జారుకునీ, వుదయం ఎనిమిది దాటితేతప్ప ముసుగు తియ్యని మనిషి. జాతీయ స్థాయిన- ఉత్తమ నటిగా ఎన్నికైన- సువర్ణముఖి కోసం- చచ్చినట్టు అలారం పెట్టుకుని ఆరుగంటలకల్లా పక్కమీంచిలేచి, ఎనిమిదింటి యింట్లోంచి బయటపడ్డాడు.

రామనాథం- కొన్ని వందల యింటర్‌వ్యూలు- రాశాడు. దక్షిణాదినవున్న అందరి తారలని అతను యింటర్‌వ్యూ చేశాడు. అయితే, ఇంటర్‌వ్యూ చేసిన- మరు క్షణంలో- వాళ్ళపేర్లు, ముఖాలతో సహా మర్చిపోటం అతని అలవాటు. సినిమా రంగం మీద గాని, ఆ రంగంలోని వ్యక్తులమీదగాని అతనికి గ్లామర్ లేదా పెద్ద యిష్టము లేదు. ఈ వృత్తిలో అతను కర్మ సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మిన వ్యక్తిలాగా- తన కర్తవ్యం, తనవృత్తి ఇవి, సక్రమంగా నిర్వహిస్తూ వుంటాడు. తామరాకుమీద నీటిబొట్టులాగా- అంటీ అంటనట్టుగా వుంటాడు సినిమా ప్రపంచంతో.

ఆటోదిగి- గూర్ఖావాడికి- తన పేరూ వగైరా చెప్పటంతో, గూర్ఖావాడు సలాం గొట్టి, లోపలికి వదిలిపెట్టాడు- మర్యాదగా పెద్ద కాంపౌండు. ముందు బారులుగా- సిమెంటు చప్టాకి రెండు వైపులా పూల మొక్కలు. ఇటూ అటూవున్న లాన్‌కి నీళ్ళుపెడుతున్న తోటవాడు.

విశాలంగా వున్నహాలు, ఒకపక్క హోటల్స్‌లో వుండే రిసెప్షన్‌లాగా- సెక్రటరీ, గుమస్తా, పనిమనిషి వగైరాలు.

రిసెప్షన్‌లో పాతిక ముప్పై ఏళ్ళ యువకుడు-ఎర్రగా మిసమిస మిసలాడుతూ- సినిమా హీరోలని- తలదన్నేంత అందంగా వున్నాడు.

"బేబి- మీ కోసం రెడీ అవుతున్నారు. ఒక్క అయిదు నిముషాల్లో వచ్చేస్తారు. లోపలి కెళ్దాం రండి"- అంటూ దారి తీస్తున్నాడు.

"పళ్ళూ - ఫైవ్ స్టార్సూ తెచ్చారా?" అడిగాడు- పక్కనున్న మరోవ్యక్తి.

రామనాథానికి అసహ్యం వేసింది ఇంత లేకిగా, నిర్మొహమాటంగా అడగుతున్నారేమిటని.

"లేదు" అన్నాడు పొడిగా.

"ఫరవ లేదు లెండి. ఇవి తీసుకెళ్ళండి" అంటూ వెండి సజ్జలో ఒక యాపిలూ, అరటి పళ్ళూ, మూడు కాడ్‌బరీ బార్సూ పెట్టియిచ్చాడు.

రామనాథం జేబులో చెయ్యిపెట్టాడు పర్సు తీద్దామని!

"వొద్దు- మీరు చేత్తోపట్టు కెళ్ళండి చాలు-" అన్నాడు అవ్యక్తి.

దేముడి గుళ్లోవి లాగా, పళ్ళ సజ్జ పుచ్చుకో. యీ చలనచిత్ర ముఖిని ప్రసన్నం చేసుకోవాలి కాబోలు. "ఏం గర్వం- ఏం ఘనత? పుడికి పోతున్నాడు.

అంబికా హెవెన్- అగరువత్తుల పరిమళం- గాలిలో అలలు అలలుగా పయనిస్తోంది. వెదురు గుళ్ళు- రంగు రంగుల వెదురు గొట్టాలు కలిపిన- పూసల తెర. ఆ తెర వెనుక— నల్ల విరుగుడు చావ వుయ్యాలబల్ల వుయ్యాలకి వెండిగొలుసుల్లాటివి- ఆగొలుసులకి- మువ్వలు. అయిదారుగురు మనుషులు కూచోగలిగినటువంటి- అర్ధ చంద్రాకారంలోవున్న ఫోమ్ రబ్బరు సోఫాలు. గదిలో నాలుగు మూలలా- ఖరీదైన- నిలువెత్తు కంచు విగ్రహాలు- గోడలకి ఆయిల్ పెయిటింగ్స్ హాలులో పైన ఛాండ్లియర్స్. దేవేంద్ర భవనంలోకి అడుగు పెడుతున్నట్టుగా వుంది రామనాథానికి- అతని- పాదాలు పూర్తిగా కూరుకుని పోయాయి. మెత్తని తివాచీలోకి నేలమీద

పాదాలు మోపుతున్నట్లు లేదు- ఊరగ దు ఎలో నడుస్తున్నట్లుంది.

"మీరు కూచోండి- బేబికి చెప్పివస్తాను" అంటూ లోపలి కెళ్ళాడు- ఎర్రగావున్న ఆ యువకుడు.

చేతిలోవున్న పళ్ళసజ్జ ఎక్కడ పెట్టాలో తెలియక- వొళ్లో పెట్టుకొని కూచున్నాడు.

అంతే "భౌ" మంటూ- దిక్కులు పిక్కటిల్లే మొరుగును వినిపించి, కూచున్నవాడు అమాంతం ఒక్క సారిగా గాల్లోకి ఎగిరి, బంతిలాగా మళ్ళీ ఆసోఫాలో కూలబడ్డాడు.

రామనాధానికి, కుక్కలంటేనూ, తాగిన వాళ్ళంటేనూ కాస్త భయం. చిన్నప్పుడు- వాళ్ళ వీధిలో ఒకడు కల్లు ఫుల్‌గా పట్టించి- తాటికాయని కోసినట్టు పెళ్ళాం మెడనరికి పారేశాడు; స్కూలునుంచి వస్తూ- ఆ ఘాతుకదృశ్యం చూసిన- రామనాధం మూడురోజులపాటు జ్వరంతో పడుకున్నాడు- భయపడిపోయి! అల్లాగే పిచ్చి కుక్కకరిచిందని- ఒకటో క్లాసు చదువుతున్నా- రంగడిపొదం మీద వాతలు పెట్టడం- వాడు సోకన్నాలు పెట్టి ఏడవటం, అతను పెద్దయినా మర్చిపోలేదు. కుక్కనిచూసినపుడల్లా- ఆ దృశ్యం జ్ఞాపకం వస్తూవుంటుంది.

"భౌ" మన్న ఆ భీకర శబ్దంతో- రామనాధం కళ్ళు గట్టిగా మూసుకున్నాడు- ఆ సోఫాలోంచి కదిలేశక్తి కూడా లేక, మొదట్లోని ఆ "భౌ" శబ్దం- రకరకాల అరుపుల్లోకి మారుతోంది.

"శామ్సన్- శామ్సన్" అన్న కోకిలగాత్రం.

రామనాధం కళ్ళు తెరిచాడు. భీకరంగా- ఫుట్‌బాల్ లాగా వున్న ముఖంతో, "గుర్" మంటూ కదలక మెదలకుండా నుల్చుని వుంది ఒకకుక్క- ఒకకుక్కేమిటి- చాలా కుక్కలు- గుంపులా నుల్చుని వున్నాయి.

"సార్-ముందు మీరా సోఫాలోంచి దిగండి-" అన్నాడు, యింట్లోకి రామనాధాన్ని తీసుకొచ్చిన యువకుడు.

"ఎట్లా? కరుస్తుందేమో" కంఠంలోని వణుకు బయటపడకుండా అన్నాడు రామనాధం.

"నేను వున్నాముగా- మా శామ్సన్‌గాడు- తన సీట్లో ఎవరు కూచున్నా వొప్పుకోడు-" అంది కోకిల స్వరం.

ఇంచుమించు, గేదె దూడంత ఎత్తువున్న శామ్సన్ బెల్టుని అవలీలగా పట్టుకునుల్చుని వుంది- సువర్ణముఖి- ఆ అమ్మాయి సువర్ణముఖి అని గుర్తించ గలిగాడు రామనాధం. బ్రతుకు జీవుడా అనుకుని, రామనాధం- పక్క సోఫాలోకి మారాడు,

"మా శామ్సన్- చాలా జెంటిల్‌మాన్‌అండీ. వూరికె అరుస్తాడు గాని- కరవడు. శామ్- అంకుల్‌ని గ్రీట్‌చెయ్-" అంది సువర్ణముఖి.

"శామ్" అని పిలువబడే- ఆ "బుల్‌డాగ్" పొట్టి తోక గిరగిరా తిప్పి- ముందు కాళ్ళు రెండూ, రామనాధం- రెండు తొడలమీదా వుంచి- 'భౌ' అంది. అయితే ఈ సారి అరుపు భీకరంగా లేదు. చాల క్లుప్తంగా వుంది ఆ మొరుగుడు.

"లే- శ్యామ్, యిట్లా వచ్చెయ్" అనగానే, అంత పెద్ద కుక్కా- దొల్లుతున్నట్లు నడుస్తూ అంతక్రితం రామనాధం కూర్చున్న సోఫాలో కూచుని, నాలిక బాగా జాపి, ముద్దుకాలు అందిస్తోంది.

"మీ చేతిలో 'యాపిల్' మా శ్యామ్‌కి- అందించండి-" అంది సువర్ణముఖి.

వొచ్చిన ప్రాణం పోయినట్లయింది రామనాధానికి యాపిల్ పండుతోపాటు చెయ్యికూడా పట్టుకుంటే- భయంగా చూశాడు సువర్ణముఖివంకే.

"మీకేం భయం లేదు. సార్ మా శామ్ చాలా మంచివాడు. ఆ పండుయిచ్చేస్తే- తింటూ కూచుంటాడు. నోటికి అందించండి" అంది నవ్వుతూ.

ఆ నవ్వు- చిరుగంటలు మోగినట్లుగా వుంది. సువర్ణముఖికి- జాతీయ స్థాయిని- వుత్తమనటిగా ఎందుకు బహుమతి యిచ్చారో అర్థం అవుతోంది. అంత సమ్మోహనంగా నవ్వగలిగిన నటికి- ఆస్కార్ ఎవార్డు యిచ్చినా తప్పులేదు అనుకున్నాడు.

భయంభయంగా- సజ్జలోని యాపిల్ తీసి యించు మించు వొణుకుతున్న చేతుల్తో అందించాడు. శామ్సన్ ఆ పండు అందుకోటానికి ముందు కాలుగాక- నోరు జాచాడు. కళ్ళు మూసుకుని భగవంతుడిమీద భారంవేసి, పండు అందించాడు రామనాదం.

'వికో వజ్రదంతి' వారి అమ్మాయి టి. వి. లో యాపిల్ కొరుకుతూ వుంటుంది- శబ్దం చేస్తూ! ఆ పిల్ల సిగ్గుపడేటట్లు- కసుక్కున ముందు కోరలు రెండూ దించేసి పర పర నమలటం మొదలు పెట్టాడు శామ్సన్.


హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు



'గిని'

వెట్ గ్రైండర్లు

మరియు

డొమెస్టిక్ పిస్టన్ టైపు పంపుసెట్లు

దీర్ఘకాలము మన్నికకు

పుష్కలముగా నీరు

అందించుటకు

పేరు పొందినవి.




సంప్రదించండి :

అల్కో ఇండస్ట్రీస్

153, తంబుచెట్టి వీధి, మదరాసు-600 001

ఫోన్ : 27003

వ్యాపార వివరములకు సంప్రదించండి.




"చూశారా? మా వాడికి యాపిల్స్ అంటే చాలాయిష్టం అండి. యాన్ యాపిలేడే...... అండీ..." ..

సన్నగా పొడవుగా వుంది. మోకాళ్ళ ాకా టైట్‌గా పట్టుకున్న– నిక్కరు లాంటి వెల్వెట్ జీన్స్ కాళ్ళకి బంగారు పాంజేబు పట్టాలు. స్లీవ్‌లెస్ రెవిక, రొమ్ముల కిందుగా పొట్టకు పైగా– ముడివేసుకుంది. పూల గుత్తిలాగావున ఆ ముడికిమధ్య– ధగ ధగ మెరుస్తున్న– డైమండ్ బ్రూచ్. చె లకు రవ్వలు తాపిన జుంకీలు, రవ్వల చెంప స్వరాలు. మెళ్ళోన , చేతులకి ఏమీలేవు. ముఖం మీద– పౌడరు కూడలేదు. పాపి లేకుండా– వెనక్కి దువ్విన జుట్టు– ఆ జుట్టు 'పోనీ టైలు' లాగా ఎత్తునుంచి వేళ్ళాడు తోంది. చూసీ చూడగానే– పదహారేళ్ళ పిల్లలా అనిపిస్తుంది. ఆ ముఖంలోని మృదుత్వం– అమాయకత– స్టిక్ కూడా వేసుకుని నిరాడంబరత చూసి. పదహారేళ్ళ పసిపిల్ల అనుకుంటారు. కాని, పదేళ్ళుగా– ఈ సువర్ణముఖి సినిమాల్లో హీరో న్‌వేషాలువేస్తున్నది. ఎంత చచ్చుగా చూసినా– పాతిక ముప్ఫయి మధ్య– అన్నవిషయం రామనాధానికి తెలుసు. కాని, ఆ వయసు . యింత అందంగా ఎలా దాచగలుగుతోంది. పిసరంత మేకప్ ాడా లేకుండా యింత నాజూగ్గా ఎలా వుండగలుగుతోంది? చు ా వున్న మనల్ని. భయాన్ని మర్చిపోయి– ఆ అమ్మాయివంక ప్పవాల్చకుండా చూస్తున్నాడు రామనాధం.

కాళ్ళ మధ్యన– ఏదో జూలులాగా మెత్తగా తగుల్తోంది. పాంటు కొసల్ని– ఎలికలా ఏదో కొరుకుతు ే– పైకి అరవబోయి, గభాలున రెండు కాళ్లు పైన పెట్టుకున్నాడు. అలా పెట్టుకోటంలో– 'కుయ్' మని శబ్దం వినిపించింది.

"హిప్పీ– హిప్పీ దెబ్బతగిలిందా– చ్చిముండ– మిమ్మల్ని "లవ్" చేస్తున్నానని– చెపుతుంటే– కాల తో కొట్టారా– పూర్, డియర్–" అంటూ నలుపూ తెలుపూ వెం కలు కలిసి, పూలు బంతిలా కదుల్తున్న ఒక ప్రాణిని చేతులోకి సుకుని, ముద్దులాడు తోంది సువర్ణముఖి. ఆ కుక్క సువర్ణముఖి ముఖాన్ని నాకుతోంది నాలుకతో "సారీ. చూడలేదమ్మా–" అన్నా రామనాధం.

"హిప్పీ– అందుకే చూడలేదట. సారీ చెప్పేస్తున్నారు. ముద్దిచ్చేయ్–" అంటూ ముందుకు జాపింది త్తుకోమన్నట్లు.

రామనాధానికి పిల్లల్ని ఎత్తుకోడమే చాతగాదు. ఇక కుక్క పిల్లల్ని ఎలా ఎత్తుకుంటాడు?

'హిప్పీ అని పిలువబడుతున్న– యీ కుక్కకి పేరు ఎవరు పెట్టారోగాని,– ఆ పేరుమటుకు సరిగ్గా సరిపోయింది దాని కళ్ళు గాని, ముక్కుగాని కనిపించటం లేదు. పరదాల్లా వేళ్లాడుతున్న ఆ జుట్టు మధ్యలోంచి ఎల్లా చూస్తుంది– అన్న సందేహం తీరక మునుపే– ముందుకు చాచబడిన– నాలికతో హిప్పీ గబగబా రామనాధం చెంపలు– మెడనాకటం మొదలుపెట్టింది.

రామనాధానికి అసహ్యం, ఏడుపు, కోపం తెరలుగా వస్తోంది. ఆక్షణాన తన ఎడిటర్ ఎదురుగా వుంటే– నిలువుగా ఖూనీచేసి– పాతిపెట్టేసి వుండేవాడు. వెనక్కి జరుగుతున్నాడు రామనాధం– హిప్పీబాగా పొడుగ్గాసాగి– మీగడ గిన్నెను నాకినంతస్పీడుగా– అతని ముఖాన్ని తన నాలికతో రుచిమరిగి– నాకేస్తోంది.

"సార్– ఆ సజ్జలోని చాక్‌లెట్‌బార్ హిప్పీకి యిచ్చెయ్యండి. మిమ్మల్ని వొదిలేస్తుంది–" అన్నాడు– ఎర్రగా బుర్రగా వున్నాడు ఆ అబ్బాయి.

రామనాధం వంగి– సజ్జలో చాక్‌లెట్‌బార్ తియ్యబోతుంటే, హిప్పీ, తల్లిచేతుల్లోంచి జారిపోయేపసిపిల్లలా– మూరెడు ముందుకు వంగింది– రామనాధం చెంపల్ని వొదలకుండా, గబగబా పైకాయితం వొలిచి ఎవరో చాక్‌లెట్‌బార్ రామనాధం చేతికి యివ్వటం, అతనా బార్‌ని హిప్పీనోటికి అందించటం, హిప్పీ చెంగున కిందకిదూకి, బార్‌నోట్లో కరుచుకుని–అమాంతం వుయ్యాల బల్లమీదకి దూకటం– రెప్పపాటులో జరిగిపోయాయి.

"అమ్మయ్యా" అనుకుని వూపిరి పీల్చుకోబోయిన రామనాధానికి, ఆవూపిరి అలా మధ్యలోనే ఆగిపోయింది– వూపిరి తిత్తుల్లోకి రాకుండానే.

ఉయ్యాల బల్లమీద నుంచి పెద్ద కల కలం, చిన్నసైజు యుద్ధం పుట్టుకొచ్చింది. 'వెండి' గొలుసులకున్న మువ్వలు గలగల కొట్టుకుని– శబ్దాలు చేసేస్తున్నాయి– ఉయ్యాలబల్ల దానియిష్టం వచ్చినట్లు– గిరగిర తిరుగుతోంది– కుక్కల అరుపులు, గురుగురులు ఏం జరిగింది?– అని అడిగే ప్రయత్నం– మధ్యలోనే విఫలం అయింది.


నల్లగా– కాటుకలాగావున్న– రెండు బంతులు రామనాధం మీదికి లేశాయి. ఈ సారి రామనాధానికి– తన మీద తనకే 'కంట్రోల్' లేక పోయింది.

"కీ" అంటూ గట్టిగా భయంతో అరిచేసాడు. ఆ అరుపుకి– ఆ రెండు నల్ల ఆకారాలు భయపడ్డాయేమో– గభాలున కిందికి దూకి, నుల్చున్న సువర్ణముఖి కాళ్ళవెనక దాక్కున్నాయి. రామనాధానికి సిగ్గేసింది– తనింత గట్టిగా అరవగలడని– అతనికే తెలియదు.

"సారీ" అన్నాడు సిగ్గుపడిపోయి.

సువర్ణముఖి చప్పట్లు చరుస్తూ, పకపక నవ్వింది. ఆ నవ్వు చాలా మధురంగా వుంది. చక్రాలవంటి– ఆ అమ్మాయి కళ్ళలో కొంటెతనం– అల్లరి– ఆ రెండు భావాలు మరోసారి చూసేందుకయినా యీ నల్ల జీవాలు యింకోసారి తనపైకిదూకితే బాగుండును అనుకున్నాడు ఆ భయంలోంచి పుట్టిన మరు ఆలోచనతో.

"ఏయ్ లటుక్కు చిటుక్కు యిట్లారండి" అంది సువర్ణముఖి రెండు చేతుల్తో రెండుకుక్కల్ని అందుకుంటూ.




కటిక చీకటి, కాటుకవంటి చీకటి, రాక్షసబొగ్గు, నల్లని నలుపు యిలాంటి ప్రయోగాలు, మాటలు అతను చదివివున్నాడు. తన వ్యాసాల్లో రాసాడుకూడాను యీ మాటలు అయితే, తనకళ్ళ ఎదురువున్న ఆ నలుపురంగుని అతను యింతవరకూ చూసిఎరగడు. నల్లగా మనిషిజుట్టు మించిన ఒక రకమైన మెరుపుతో నిగనిగలాడుతున్నాయి లటుకు-చిటుకు అని పిలవబడే ఆ శునకరాజాలు రెండూను అడ్డంగా పొట్టికాళ్ళతో నేలమీద చెవులు రెండు జారాడుతున్నట్లుగా వున్నాయి. వొంటినిండా నల్లనిజుట్టు. రామనాధాన్నిచూసి ఆ రెండు జంతువులూ భయంతో గజగజలాడి పోతున్నాయి. బహుశా అతను వేసినకేక వాటిచెవుల్లో యింక ప్రతిధ్వనిస్తున్నదో ఏమో!

"హిప్పీగాడికి చాక్‌లెట్ బార్ యిచ్చారు నా తమకేం యివ్వలేదని గోలపెడుతున్నాయి అవునా?" అడుగుతోంది సువర్ణముఖి.

"ఏం యివ్వను?" గుటకలు మింగుతూ అడిగాడు రామనాథం.

"అప్పుడే వద్దు దొంగ వెధవలు. అనేకవుయ్యాల ఎక్కేస్తాయి!" అంటూ పక్కసోఫాలో కూచుంది సువర్ణముఖి. అంత టైట్‌గావున్న పాంట్ కూచున్నప్పుడు చినిగిపోదు అన్న సందేహంతో చూశాడు ఆమెవంక కాని, సువర్ణముఖి కూచోటం కూడా మాస్టర్ చేసింది. అదికూడా ఒక కళే అన్నట్లు బాలేడాన్సర్‌లాగా అతి గ్రేస్‌ఫుల్‌గా సోఫాలో కూచుంది కాలుమీద కాలువేసుకుని. అప్పుడు కళ్ళబడ్డాయి కాళ్ళకివున్న హైహీల్సు బంగారు రంగులో తళతళమంటూ అనుకోకుండానే "బంగారపు హీల్సా?" అని ప్రశ్నించాడు.

సువర్ణముఖి అవునూ అనలేదు, కాదు అనలేదు, చిన్నగా నవ్వింది ఇదికూడా ఒక ప్రశ్నేనా అన్నట్లు. తను చాలా ఫూలిష్‌గా అడిగాననుకున్నాడు రామనాధం.

"రాముా కాఫీ పంపించమను" అంది సువర్ణముఖి.

ఎర్రగా బుర్రగా ఉన్న ఆ వ్యక్తి పేరు 'రాము' అన్న సంగతి టికి కనుక్కోగలిగాడు రామనాథం.

జేబులోంచి స్క్రిబ్లింగ్ పాడూ, బాల్ పెన్ను తీసుకుని ప్రశ్నలు అడగటానికి తయారవుతున్నాడు రామనాధం. బాల్‌పెన్ కాప్‌తీసి చేతిలో పట్టుకున్నాడో లేదో, అతను మోకాళ్ళమీద వుంచామన్న పాడ్ గాలిలోకి మాయం అయిపోయింది. కాకి ఎత్తుకుపోయినట్లు ఏదో జంతువు "పాడ్" కాస్తా ఎత్తుకుపోయింది వొళ్లోనుంచి.

"అరే జాకీ అది పేపరుకాదమ్మా అంకుల్‌పాడ్ యిచ్చెయ్యి" అంటూ పిలుస్తోంది సువర్ణముఖి. తెల్లగా వొంటినిండా బొచ్చుతో వున్న కుక్కపిల్ల జాకీ అన్న పేరుగల ఆ కుక్క నోట్లో పాడ్ కరుచుకుని "దమ్ములుంటే-వొచ్చితీసుకో" అన్నట్లుగా ఛాలెంజ్ చేస్తూ ఎదురుగుండా ముందుకాళ్ళమీద కూచునివుంది.

రామనాధం వేళ్ళు లెక్కపెట్టుకుంటున్నాడు.

"ఇది అయిదోనెంబరండి" అంది సువర్ధముఖి అతి సహజంగా తల్లి తనకెంతమంది పిల్లలో చెబుతున్నట్లుగా కాస్త గర్వంగానే.

వెండిట్రేలో కాఫీకప్పులూ, సాసర్లూ బిస్కట్లూ వచ్చాయి. అన్నీ వెండివే. రామనాధానికి తమాషాగావుంది. రాజులు, జమిందార్లూ పోయారు. ఈ నాటికి యీ సినిమా తారలు తమ సంపదని యిలా ప్రదర్శిస్తున్నారుకాబోలు.

వెండి జగ్గులోంచి వెండి ప్లేట్లో కాఫీ పోసి 'రాముా' అంటూ పిలిచింది. సువర్ణముఖి ఈ మాదిరి పిలుపు, ఆ పిలుపులోని ఆప్యాయతకి, ఆర్ద్రతకి తెలుగు ప్రేక్షకులు పిచ్చెక్కిపోయి ప్రతి ఒక్కరూ తమనే యీ సువర్ణముఖి పిలుస్తోందని పదేసి సార్లు ఆమె సినిమాలు చూసిన వెర్రి వాళ్ళున్నారు.

బాగా ముసలిదైపోయిన పెద్ద సైజు అల్సేషియన్ నెమ్మదిగా వస్తోంది. ఆ నడకలో ఠీవి, రాజసం, వయసుతీసుకొచ్చిన అసహాయత, ఆమె పిలుపులో గల ఆకర్షణ వీటన్నిటిని మిళితం చేస్తూ వచ్చిన ఆ కుక్కని చూస్తే రామనాధానికి జాలి, గౌరవం కలిగింది.

సాసర్‌లో కాఫీ పోసి వంగి మోకాలు మీద కూచుని, ఆ కుక్క చేత అతి శ్రద్ధగా కాపి తాగిస్తున్న సువర్ణముఖి ముఖంలో గల ఆపేక్ష, ఆప్యాయత రామనాధాన్ని ముగ్ధుణ్ణి చేశాయి. గబుక్కున స్ప్రింగ్ బాగ్‌లోంచి కెమేరా తీసి నాలుగుస్నాప్స్ తీశాడు. కెమేరా పక్కన పెట్టాడు ప్రశ్నలు అడగటానికి తయారవుతూ.

"మీ మొదటి సినిమా ?"


"ఈ రాముా చూశారా ఎలక పిల్లంత వుండగా వీడిని తీసుకొచ్చాను. కళ్ళు కూడా తెరవలేదు సరిగ్గా ఆ రోజునే నా మొదటి పిక్చరు కాంట్రాక్టు మీద సంతకం పెట్టాను" అంది సువర్ణముఖి ఇంకా తివాచిపైన మోకాళ్ళ మీద కూచునే ఆమె పిక్కలు తెల్లగా అరిటి దూటల్లా నున్నగాఉన్నాయి.

స్క్రిబ్లింగ్ పాడు మరొకటి తీసుకొచ్చి యిచ్చాడు రాము. ఆ పాడ్ మీద ఆమె చెప్పిన తొలిసినిమా వివరం రాసుకోబోతుంటే జాకీ మళ్ళి పాడ్‌ని కాస్తా నోటకరుచుకు పోయింది ఒక్క దూకుతో.

పట్టువదలని విక్రమార్కుడిలాగా రామనాధం ఇంటర్‌వ్యూలో చెప్పిన విషయాలు జ్ఞాపకం పెట్టుకుని ఆనక రాసుకోవచ్చు అన్న భరోసాతో ప్రశ్నలు అడగటం ప్రారంభించాడు

"ఎవార్డు వచ్చిందని రేడియోలో విన్నపుడు మీకు ఏం అనిపించింది?

"నా సంగతి ఏమోగాని మా లటుకూ చిటుకూ బలే!




తలకిందులై పడిపోయాయి ఒకటే సర్కస్ ఫీట్లు చేశాయి. అన్నట్లు మా వాళ్ళ ఫీట్లు మీరు చూడలేదుగదూ ఏం లటుకు చిటుకు" పిల్చింది సువర్ణముఖి.

రామనాథానికి జుట్టు పీక్కోవాలని పిస్తున్నది. ఏ మాట అడిగినా, చివరికి శునకాల దగ్గరకి వచ్చేస్తోంది ఈ లోపల లటుకు, చిటుకు అనబడే ఆ నల్లకుక్కలు రెండూ తోపులు నేల మీద యీడ్చుకుంటూ వచ్చాయి ఎర్రగా వున్న నాలికలు బయట పెడుతూ సోఫా వైపుకి చూస్తూ. రామనాథానికి భయంగా వుంది బాల్ పెన్ లాక్కుంటాయేమోనని.

"పిటిల్లో ఏది మొగకుక్క ఏది ఆడకుక్క చెప్పుకోండి? "అడిగింది సువర్ణముఖి చిక్కు ప్రశ్న వేస్తున్నట్లుగా.

"నా బాధ యింకా సేపయితే నేనెవరో మర్చిపోయి. మొరగటం మొదలు పెట్టేట్టు వున్నాను అనుకున్నాడు రామనాథం.

"చూపించు, నువ్వెవరో, చూపించు" అంది సువర్ణముఖి నీ పేరు చెప్పమ్మా అని పాపని అడిగినట్లు.

వెంటనే ఆ రెండు కుక్కలూ నేలమీద వెల్లకిలాపడుకుని, నాలుగు కాళ్ళూ గాల్లోకి నిలబెట్టాయి. రామనాథానికి సిగ్గేసింది ఎటువైపు చూడాలో తెలియక తలవంచుకున్నాడు. ఈ మధ్య వొచ్చే క్లబ్ సీనుల్లోని డాన్సర్ కంటె 'అబ్సీన్'గా వుంది యీ రెండు కుక్కలూ వెల్లకితులాపడుకుని ప్రదర్శన యివ్వటం.

"ఇక వాటికి పళ్ళుయిచ్చెయ్యండి" అంది సువర్ణముఖి.

పక్కనున్న అరటిపళ్ళు రెండూ చెరొకటి వాటివైపుకి విసిరాడు. కుక్కలు బిస్కట్లూ అవి కాచ్ చేస్తాయని ఎక్కడో చదివింది జ్ఞాపకంవచ్చి. ఆ రెండూ పళ్ళని పట్టుకోలేదు సరిగదా గుర్రుగా చూస్తున్నాయి రామనాథం వంక.

"వాటిని యినసల్ట్ చేశారు. అవేం పిచ్చగాళ్ళు అనుకున్నారా?" కోపంగా ప్రశ్నించింది సువర్ణముఖి.

రామనాథం గుండెలు అరికాళ్ళలోకి జారుతున్నాయి.

"సారీ అమ్మా" అన్నాడు.

"నా క్కాదు. వాటికి సారీ చెప్పి అరటిపళ్ళ తొక్కలు వొలిచి తినిపించండి" అంది మహారాజు లాగా.

"తప్పుతుందా?" అనుకుంటూ తొక్కలు వొలిచి పళ్ళు ఆ రెంటి నోళ్ళకి అందించాడు. హాయిగా రెండుపళ్ళూ చెరొకటి ఆరగించి గబుక్కున వుయ్యాలబల్లమీదకి దూకేసి. వుండచుట్టుకు చెరోమూల పడుకున్నాయి. వాటి దూకుడుకి వుయ్యాలబల్ల వూగింది, "వెండి" గొలుసులకున్న మువ్వలు గలగల మన్నాయి. వుయ్యాల బల్లవైపు పరిశీలనగా చూసాడు రామనాథం. బల్లకి నాలుగువైపులా గిలకలు. వుత్త గిలకలు కావు నగిషీలు చెక్కిన గిలకలు. లోపల ఫోమ్ రబ్బరు పరుపు, పైన సిల్కు దుప్పటి. "ఆహా కలవారి యింట కుక్కలాయి వుట్టటం అంటే యిదే కాబోలు" అనుకున్నాడు మనసులో.

"ఇంతకీ ఎవార్డువచ్చిందని విన్నపుడు మీకేం అనిపించింది ఎల్లా 'సెలబ్రేట్' చేసుకున్నారు?"

"మా శామ్సన్, జాకీ, హిప్పీ, లటుకూ చిటుకు మేమందరం అయిస్క్రీమ్ తిన్నాం. మా "రాము మటుకు తినలేకపోయాడు. జాకీ వూలుబంతితో ఆడమని, గోలచేసింది......"

పక్కన ఏదో కదులుతున్న అలికిడి. రామనాథం తల తిప్పి చూశాడు. ఫిలిమ్‌రోల్‌ని అతిసునాయాసంగా కొరికేసి, రోలంతా విప్పి ఆడుకుంటున్నది జాకి.

గుండె గుభేలుమంది క్రితం రోజు డైరెక్టర్‌ని యింటర్వ్యూ చేస్తూ ఫొటోలు తీసిన రోల్ అది. అయిపోయిన రోల్‌ని బాగ్ లోనే మర్చిపోయాడు ఈడ్చి తన్నాలనిపించింది జాకీని అతనిముఖం లోని భావాల్ని చదివేసినట్లు;

"రామూ" అని పిల్చింది తీవిగా.

ఎర్రబ్బాయి పరుగున వచ్చాడు. "పైకెళ్ళి రోల్ పట్రా" అంది మహారాజ్ఞిలాగా

తమపేరు పెట్టి పిలుస్తే ఎక్కడున్నా సరే కుక్కలు తలెత్తి చూస్తాయంటారు. కాని "రాము" అని పిల్చినపుడు కుక్కగారయిన రాము రాకపోవటం కనీసం తలఎత్తికూడా చూడకపోవటం గమనించాడు రామనాథం.

"ఇంట్లో ఎవరూ లేరా?" అడిగాడు రామనాథం ఏదో ఒకటి అడగాలని.

"మా వాళ్ళంతా గుడికెళ్ళారు నా పేరున అభిషేకం చేయించాలని-"

"మీకు దేముడిమీద నమ్మకం లేదా?"

"మా రాముకి యింజక్షనివ్వటానికి డాక్టరుగారొస్తారు. ఆయన్ని చూసేప్పటికి మాహిప్పీవుందే, యిది గజగజ వొణికిపోతుంది భయంతో. ఎవరు, పట్టుకున్నా ఆగదు-"

అన్ని నదులూ సముద్రంలో కలుస్తాయి. ఈ సువర్ణముఖి సంభాషణంతా కుక్కలమయం ఎక్కడ ఆరంభించి నా కుక్కల దగ్గర ముగిస్తోంది. ఎట్లా అబ్బా? అనుకున్నాడు రామనాథం.

"ఎవార్డు వచ్చిందని మీకు సంతోషంగా లేదా!"

"నా కంటే మా లటుకూ వాళ్ళకి హాపీగావుంది అయిస్క్రీమ్ ఎప్పుడో గాని పెట్టను-"

"మీ బర్త్‌డే ఎప్పుడో చెప్పండి? మా పాఠకులు మీకు గ్రీటింగ్స్ పంపాలని ఆత్రుత పడుతున్నారు-"

"ఈ సారి నా బర్త్‌డే 'పెట్' లో జరుపుతాను...."

"ఏం?"

"ఇంటిదగ్గర మా హిప్పీ-జాకీ"

రామనాధానికి గట్టిగా కేకేసుకుని అరవాలనిపించింది. 'ఎదుటివాడికి నీ భాష అర్థం కాకపోతే, వాడి భాషలోనే నువ్వు మాట్లాడు' అని జర్నలిజం నేర్పిన పాఠం ఆచరణలో పెట్టి, తానే ఆరంభించాడు.

"మీకు చిన్నప్పటినుంచి కుక్కలంటే ఇష్టమా?"

సువర్ణముఖి మొఖం మతాబాలా చిరునవ్వుతో వెలిగింది. "నా చిన్నప్పుడు గజ్జి కుక్కపిల్లను తీసుకొచ్చి ...." ఆమెవాక్ ప్రవాహం అక్కడితో ఆపాలని "మిమ్మల్ని చూస్తుంటే నాకు జునాగడ్ నవాబుగారు జ్ఞాపకం వస్తున్నారు."

"ఆయన మీ ఫ్రెండా?"

'నా తలకాయ' అనుకుని, "ఇప్పటివాడు కాదండీ స్వదేశ సంస్థానాల్లో జునాగడ్ కూడా ఒకటి"

విసుగ్గా చూసింది సువర్ణముఖి. ఆమె దృష్టిని ఆకట్టుకోటానికి "ఆయనకి పెంపుడు కుక్కలంటే ప్రాణం. కుక్కలపెళ్ళికోసం కోట్లు ఖర్చుపెట్టి రాజ్యంలో అంతా సెలవుయిచ్చాడు కుక్కల పెళ్ళి రోజున"

"అరె, ఇంతమంచి విషయం నా కెవ్వరూ చెప్పలేదే! రామూ...." పిల్చింది.

"ఈ పరకొండున లటుకు చిటుకూ బర్త్‌డే కదూ-"

"అవునండి" అన్నాడు రాము.

"ఆరోజున్న నున్న కాల్‌షీట్స్ కాన్సిల్ చేసెయ్యి"

"ప్రొడ్యూసర్‌గారు వొప్పుకోరేమో చాలా పెద్దసెట్టు."

"ఏమైనాసరే మన ట్విన్స్ లటుకూ చిటుకూ బర్త్‌డే పెద్ద ఎత్తున సెలిబ్రేట్ చెయ్యాలి."

"ఇంట్లో ఎందుకండి సెట్‌లోనే సెలిబ్రేట్ చేద్దాం-" అన్నాడు రాము.

"రైట్; నా బర్త్‌డే సెలబ్రేట్ చేస్తామని పోటీలు పడ్తూంటారుగా. ఈసారి మన ట్విన్స్ బర్త్‌డేపార్టీ సెట్‌లో పెడ్తామంటాను. రాము; చాక్‌లెట్ కేకులు పెద్దకేకులు చెయ్యాలని చెప్పు. నోట్ చేసుకో. మీరుకూడా రావాలండి. మేమంతా కామ్సన్‌తో సహా వస్తాం-" అంది చాలా వుత్సాహంగా పసిపిల్లలాగా గంతులువేస్తూ.

"ఎవార్డ్ వచ్చినప్పుడు మీ ఫీలింగ్స్ గురించి .."

కారుహారన్ బొయ్‌మన్న శబ్దం. వుయ్యాలబల్లమీంచి మూడు కుక్కలూ ఒక్కసారి కిందకి దూకాయి. సోఫాలో కామ్సన్ గుర్ మంటున్నాడు. హిప్పీ గజగజ వణుకుతోంది. "డాక్టరుగారు వచ్చారండి చాలా థాంక్సండీ" అంటూ లేచింది సువర్ణముఖి.

టైము చూసుకున్నాడు రామనాధం. పదిదాటింది. ఇక అక్కడుంటే మర్యాద దక్కదని బయటికి నడిచాడు.

"రామూ అయన్ని బండిలో డ్రాప్ చెయ్యమని డ్రయివర్‌కు చెప్పు" అంటోంది సువర్ణముఖి.

రామనాధానికి పిచ్చిగావుంది సర్వం కుక్కమయంగావుంది. తను షుమారు రెండుగంటలసేపు సువర్ణముఖి యింట్లోగడిపాడు. ఏం మాట్లాడాడు? ఏం సేకరించాడు?

విసుగ్గా కోపంగావుంది. గబగబా యింటర్వ్యూ రాసేసి నెగిటివ్ రోల్‌కూడా జతపరిచి హైదరాబాద్ ప్లేన్‌కి అందించాడు.


SPADE Elektro


Offers
WASHING MACHINES
at just Rs. 950/-
Geyser at just
Rs. 650/-
Mixer at just
Rs. 490/-



Balance on easy instalments



Stockist RAMA ELECTRONICS
Opposite Ayodhya Hotel Lakdikapul
Hyderabad-500 004 Phone: 226194




నాలుగోరోజు ఉదయం ఎడిటర్ మద్రాసులో ప్రత్యక్షమయి శ్రీముఖం చేతికి యిచ్చేదాకా తానేమి రాసిందీ ఏమి అచ్చయిందీ కూడా చూసుకోలేదు. అతను.

"ఏవయ్యా ఎంత ధైర్యం ఏం రాశావో చూడు?" అంటూ పత్రిక కళ్ళముందు పెట్టాడు ఎడిటర్.

"అవార్డ్ తార శునకముఖితో ఇంటర్వ్యూ" అన్న శీర్షిక తాటికాయంత అక్షరాల్తో కొట్టొచ్చినట్లు అచ్చయింది.

"ఎవరండీ యీ పేరు పెట్టింది?"

నువ్వు యిల్లా అంటావని తెలుసు. అందుకే నీ చేతుల్తో రాసిన కాయితాల్తో సహావచ్చాను"

"నేనా? నేనా?"

"నీ హాండ్ రైటింగ్ చూడు... పత్రిక డిస్పాచ్ కూడా అయిపోయింది. నా కొంప ముంచావు గదయ్యా యిష్టం లేకపోతే యింటరువ్యూ చెయ్యనని చెప్పకపోయావా"

"ఆ మాట రాసినట్లు జ్ఞాపకం లేదండి పొరబాటు..."

పొరబాటు గ్రహపాటో 'బాస్' చిందులు తొక్కుతున్నాడు. మన పత్రికా సంస్థలో సువర్ణముఖికి ఎన్ని షేర్లు ఉన్నాయో తెలుసా?"

"తెలియదండి" అన్నాడు రామనాథం. అతని కళ్ళలో కుక్కలగుంపు కదులుతోంది.

"ఎక్కువ పెట్టుబడి ఆవిడదేనయ్యా, బాబూ!"

"పోనీ, మీరెవరన్నా... తప్పు దిద్దక పొయ్యారా?"

"నువ్వు రాసిన దాంట్లో ఒక్క అక్షరం కూడా మార్చకూడదని యినస్ట్రక్షన్లు యిచ్చావుగదయ్యా...."

"ఇప్పుడేం చెయ్యమంటారు? రిజైన్ యిచ్చెయ్యనా?"

"ఇవ్వు. లేకపోతే, యింకా గొడవ అవుతుంది" అంటూ బాగ్‌లోంచి కాయితాలు తీసి, నాలుగింటి మీద సంతకాలు పెట్టించుకుని భగవత్‌గీత శ్లోకం చదివి తాను నిమిత్తమాత్రుడిని అంటూ వెళ్ళిపోయాడు.

రామనాథం తను ఎం కాయితాలమీద సంతకాలు పెట్టిందీ చూడలేదు. కళ్ళు మూసుకు సంతకాలు పెట్టేశాడు ఏ క్లయిమ్సూ అక్కరలేదని.

ఆ సాయంత్రం లోపల లక్షసార్లు తిరిగి తిరిగీ ఆలోచించాడు "శునకముఖి" అని తనకి తెలియకుండానే తన ప్రమేయం లేకుండానే ఎలా రాశాను, ఎలా రాయగలిగాను అని శునకాల ప్రభావం తనమీద కూడా అంత గాఢంగా పడిందా!

ఆ సాయంత్రం నాలుగున్నరవేళ ఫోన్ మోగింది. "చిత్రగమన" వారపత్రికకు ప్రత్యర్థి అయిన 'చలనగంగ' వారపత్రిక నుంచి ఎడిటర్‌గారు అర్జంటుగా మాట్లాడాలంటున్నారని.

"హల్లో రామనాథం గారా నమస్కారాలండి కంగ్రాట్యులేషన్సు..." గంగల మాట్లాడుతున్నాడు.

"దేనికి!" వుద్యోగం పోయిన చికాకులో తీవ్రంగానే అడిగాడు రామనాథం.

"మీరు ఎంతబోల్డుగా, అల్లరిగా రాసినందుకు మాకు చాలా సంతోషంగా వుంది. మా ప్రొప్రయిటర్‌గారు తమర్ని కలుసుకోవాలని మిమ్మల్ని మా కుటుంబంలోకి చేర్చుకోవాలని ఆత్రపడుతున్నారు."

"నన్నా"

"సత్యవేణిగారు మీకు మరీ మరీ తమ మాటగా చెప్పమన్నారు. మీకిప్పుడు అందుతున్న దానికంటే అయిదు వందలు ఎక్కువ యిస్తామని, తమ పేరున ఫియట్ బుక్ చేస్తామనీ అంతవరకూ ఆఫీసులోది పంపుతామని చెప్పమన్నారు"

"ఆలోచించి చెపుతాను"

"అల్లా అంటే వొప్పుకోరండి ఎంప్లాయిమెంట్ లెటరుతో, ఏడింటికి వస్తానన్నది ఈ లోగా తచ్చేదామంటే రాహుకాలం. అందుకని సందేహిస్తున్నాను, మరోసారి కంగ్రాట్సు చెపుతూ..."

బూరెల బుట్టలో పడటం అంటే యిదేకాబోలు అనుకుంటూ చెంపలు తడుముకున్నాడు రామనాథం. మూడురోజులయినా హిప్పీ నాలిక ఎంగిలి వదలనట్టుగా అనిపించింది.